ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
జిల్లా వార్తలు
3
బుధవారం 12 జూన్ 2024





బడికి వేళాయె

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- స్కూల్స్‌కు చేరిన పుస్తకాలు, యూనిఫామ్స్
- ఈయేటి నుంచి షూ పంపిణీ
- స్కావెంజర్లను నియమించాలని కోరుతున్న ఉపాధ్యాయులు
- 19 వరకు కొనసాగుతున్న 'బడిబాట'

కరీంనగర్ టౌన్, జూన్ 11: ఆట..పాటలకు ఇక సెలవు.. వేసవి సెలవులతో ఇన్నాళ్లు ఎంజాయ్ చేసిన పిల్లలు ఇకపై పుస్తకాలతో బడిబాట పట్టనున్నారు. ఇందుకోసం పిల్లలతో పాటు తల్లిదండ్రులు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తెచ్చేందుకు ఇప్పటికే బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి బడీడు, బడిమానేసిన పిల్లలను, కొత్త విద్యార్థులను చేర్పించే పనిలో ఉపాధ్యా యులు నిమగ్నమయ్యారు. మరోవైపు ప్రైవేట్ పాఠశాలల్లో జూన్ 1 నుంచి ప్రవేశాలు తీసుకోవడంతో పిల్లలను చేర్పిస్తున్నారు. ప్రతియేడు మాదిరిగానే ఈ విద్యాసంవత్సరంలో కూడా జూన్ 11 వరకు వేసవి సెల వును ప్రకటించిన ప్రభుత్వం 12వ తేదీ బుధవారం నుంచి పాఠశాలల పునఃప్రారంభించాలని ఆదేశించింది. దీంతో బుధవారం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ప్రాథమిక ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి 4.15 వరకు పనిచేస్తాయి. అలాగే ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు హైస్కూల్స్ పనివేళలుగా ప్రభుత్వం ప్రకటించింది.

● నేడు అమ్మ ఆదర్శ పాఠశాల దినోత్సవం

- ఉదయం 7 నుంచి 9 గంటల వరకు అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాఠశాలలను ఆకర్షణీయంగా అలంకరించుట.. పండుగ వాతావరణం కల్పించి విద్యార్థులతో కలిసి రంగోళి కార్యక్రమం నిర్వహిస్తారు.
- తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చేపట్టిన అభివృద్ధి పూర్తి చేసిన పనులపై అవగాహన కల్పించుట.
- ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి.
- పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్ నోట్‌బుక్కులు, యూనిఫామ్, షూలను పంపిణీ చేయాలి.
- గత విద్యా సంవత్సరంలో చదువులు, క్రీడలు, ఇతర రంగాల్లో రాణించిన విద్యార్థుల విజయగాథలను వివరించడంతో పాటు ఆ పిల్లల తల్లిదండ్రులను అభినందించాలి.

● అమ్మ ఆదర్శ కమిటీలతో బడులకు నూతన హంగులు

గత ప్రభుత్వం మన ఊరు...మన బడి.. మన బస్తీ కార్యక్రమంలో జిల్లాలో 231 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించి కార్పొరేట్ హంగులతో తీర్చిదిద్దింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చక్కటి ఫర్నిచర్, మంచినీటి సౌకర్యం, విద్యుదీకరణ, భవనాల మరమ్మతులు, రంగులు వేయడంతో పాటు నూతన హంగులతో భవనాలను తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే ఈ పనులు జిల్లాలో దాదాపు పూర్తయ్యాయి. జిల్లాలో 651 ప్రభుత్వ పాఠశాలలు, 11 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ బడుల్లో గతంలో స్కావెంజర్లను నియమించడంతో వారు నిత్యం పాఠశాల తరగతి గదులతోపాటు మరుగుదొడ్లను శుభ్రంచేసే వారు. కొవిడ్-19 కారణంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం ఆ తర్వాత స్కావెంజర్లను నియమించలేదు. అయితే సంబంధిత గ్రామపంచాయతీ, మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో పారిశుధ్య పనులు చేయించాలని ఆదేశాలు జారీ చేసినా గత ఏడాది చాలా పాఠశాలల్లో పారిశుధ్య పనులు జరుగలేదు. ఉపాధ్యాయులే స్వంతంగా డబ్బులు పెట్టి పరిశుభ్రత కార్యక్రమాలను చేయించుకున్నారు. కనీసం ఈ విద్యాసంవత్సరంలోనైనా ప్రభుత్వం స్కావెంజర్లను నియమించాలని ఉపాధ్యాయులు కోరుతు న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్క రించాలని కోరుతున్నారు.

సురక్షిత మంచినీటిని అందిస్తున్నాం

- 24/7 నీటిని అందించడమే ప్రధాన లక్ష్యం
- త్వరలో హౌసింగ్‌బోర్డులో నిరంతర నీటి సరఫరా
- మేయర్ యాదగిరి సునీల్‌రావు



ఫిల్టర్ బెడ్ సమీపంలో నీటిశుద్ధి యంత్రాలను పరిశీలిస్తున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ టౌన్, జూన్ 11: నగర ప్రజలకు శుద్ధిచేసిన సురక్షితమైన మంచినీటిని నగరపాలక సంస్థ అందిస్తుందని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌తో కలిసి ఎల్‌ఎండి సమీపంలోని ఫిల్టర్‌బెడ్‌ను సందర్శించి మంచినీటిని శుద్ధిచేసి సరఫరా చేస్తున్న విధానాలను పరిశీ లించారు. ఈ సందర్భంగా మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ నగర ప్రజలందరికీ నిరంతర (24/7) మంచినీటిని అందించడమే నగర పాలక సంస్థ ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని చర్యలు చేపడుతున్నామని అన్నారు. నిరంతర మంచినీటి సరఫరాకు హౌసింగ్‌బోర్డుకాలనీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని అక్కడ అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లతో పాటు ఇంటింటికీ మీటర్ల బిగింపు కార్యక్రమాలను చేపట్టామని, అవి తుది దశకు చేరుకున్నందున త్వరలోనే వాటిని పూర్తిచేసి అక్కడ నిరంతర నీటి సరఫరాకు శ్రీకారం చుడతామని అన్నారు. ఆ తర్వాత దశలవారీగా నగరంలోని అన్ని డివిజన్లలో 24/7 మంచినీటి సరఫరాను విస్తరిస్తామని మేయర్ సునీల్‌రావు ప్రకటిం చారు. 24 గంటల నీటి సరఫరా కోసం బూస్టర్ పంపుల సామర్థ్యాన్ని పెంచడడంతో పాటు అదనంగా 10 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన మరో ఫిల్టర్‌బెడ్ నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. నగర ప్రజలకు ఇప్పుడు ఏ విధంగా నల్లానీటిని అందిస్తున్నామో అదే విధంగా విలీన గ్రామాల డివిజన్లు, శివారు ప్రాంతాల్లో కూడా రాబోయే రోజుల్లో మంచినీటిని అందిస్తామని చెప్పారు. ఇందుకోసం 147 కోట్ల రూపాయలతో శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల డివిజన్లలో మంచినీటి పైపులైన్లు వేసేందుకు టెండర్లు పూర్తిచేశామని, పనులు కూడా వేగంగానే జరుగుతున్నాయని చెప్పారు. మంచినీటి విషయంలో నగర ప్రజలు ఆందోళన చెందవద్దని, పూర్తిస్థాయిలో శుద్ధిచేసిన మంచినీటిని అందిస్తున్నందున విశ్వాసంతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జంగిలి ఐలేందర్ యాదవ్, డీఈ లచ్చిరెడ్డి, ఫిల్టర్‌బెడ్ అజయ్, ఏఈ గట్టుస్వామి, ఆర్వీ అధికారి సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మహాశక్తి ఆలయ వార్షికోత్సవం

- అభిషేకాలు, హవనాలు, ప్రవచనం, పారాయణాలు
- అందరూ సమాజ సేవలో మమేకం కావాలి
- హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి



పూర్ణాహుతి నిర్వహిస్తున్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి

కరీంనగర్ కల్చరల్, జూన్ 11: జిల్లా కేంద్రంలోని చైతన్యపురి మహాశక్తి ఆలయంలో మంగళవారం చతుర్దశ వార్షికోత్స వాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని ప్రతిష్ఠించిన జగద్గురు శంకరాచార్య హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం 4-30 గంటల నుంచి అమ్మవార్లకు అభిషేకం, స్వస్తి పుణ్యాహవాచనం, గణపతి పూజ, లక్ష్మీగణపతి హోమం, రుద్ర సహిత చండీ హోమం జరిగింది. రాత్రి 7 గంటల నుంచి ముత్తైదువులచే సామూహిక కుంకుమార్చనలు, హనుమాన్ చాలీసా, లలితా సహస్రనామ పారాయణాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం స్వామీజీ అనుగ్రహభాషణం చేశారు. కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సతీమణి అపర్ణ, భక్తులు పాల్గొన్నారు. నాలుగు ధర్మాలతో పాటు ఐదవ ధర్మమైన సమాజ సేవలో అందరూ సమాజదేవోభవ అంటూ భాగస్వా ములు కావాలని హంపీ పీఠా. ధిపతి విద్యారణ్య భారతీస్వామి పేర్కొన్నారు. దేవాల యం ఓ స్ఫూర్తి కేంద్రం. భారతీయ సంస్కృతి శ్రేష్ఠమైంది. ప్రతి ఒక్కరూ చిన్నా పెద్దా ఆలయాలను సందర్శించి తోచిన సహాయం చేయాలి. విదేశాలు కూడా అను సరిస్తున్న భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను, ధర్మాన్ని కాపాడుకోవాలన్నారు. వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.



పాల్గొన్న భక్తులు

చెరువుల్లో పూడికతీతలు

- అమృత్‌సరోవర్ పథకంలో చెరువుల అభివృద్ధి
- ఆరు గ్రామాల్లో రూ.35లక్షలు మంజూరు
- ఉపాధి కూలీలకు వర

కరీంనగర్ రూరల్, జూన్11: కేంద్రం ప్రభుత్వం అమృత్‌సరోవర్ పథకంలో భాగంగా చెరువుల అభివృద్ధి పనులను చేపట్టింది. చెరువుల్లో పూడికతీసి రైతుల పొలాల్లో పోసుకోవడంతో నేలకు పోషకాలు అందుతాయి. చెరువుల్లో నీటి నిల్వలు పెరిగి భూగర్భ జలాలు పెంపొందుతాయి. పశువులకు నీటి సదుపాయం పెరుగు తుంది. ఈ పథకంలో ఆయా గ్రామాల్లో చెరువులను ఎంపిక చేసి అభివృద్ధి చేస్తారు. చెరువుల్లో పూడికతీతతో ఉపాధి కూలీలకు పనులు కల్పించవచ్చు. నీటి నిల్వలు పెరిగి చుట్టు పక్కల బావుల్లో నీటిమట్టం పెరుగుతుంది. కరీంనగర్ రూరల్ మండలం చామనపెల్లి గ్రామంలో ఈ నెల 5వ తేదీన పర్యావరణ దినోత్సవం సందర్భంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా అమృత్ సరోవర్ చెరువు ప్రాంతంలోనే ప్రారంభించారు.

● ఆరు గ్రామాల్లో చెరువుల అభివృద్ధి

కరీంనగర్ రూరల్ మండలంలో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద ఆరు గ్రామాలను ఎంపిక చేసింది. చామ నపల్లి, చెర్లబూత్కూర్, బొమ్మకల్, జూబ్లీనగర్, మందులపల్లి, మొగ్దుంపూర్ గ్రామాలను ఎంపిక చేసి 35.61లక్షల నిధులు మంజూరు చేసింది. ఇందులో 19,71లక్షల నిధులు ఇప్పటి వరకు ఖర్చు చేయగా మిగిలిన నిధులను అవసరమైన పనులకు ఖర్చు చేసుకోవచ్చు. గ్రామాల వారీగా చూసుకుంటే చామనపల్లి చెరువుకు 9.99లక్షలు, చెర్లబూత్కూర్‌లో 4.80లక్షలు. బొమ్మ కల్ 7.47లక్షలు, జూబ్లీనగర్ 4.26లక్షలు, మందులపల్లి 4.35లక్షలు, మొగ్దుంపూర్ చెరువుకు 4.74లక్షలు మంజూరు అయ్యా యి. ఇందులో మొగ్దుంపూర్, బొమ్మకల్, మందులపల్లి, చామనపల్లి గ్రామాల్లోని అమృత్ సరోవర్ కింద చేపట్టిన చెరువు అభి వృద్ధి పనులు పూర్తి కాగా, ఇటీవల జూబ్లీనగర్, చెర్లబూత్కూర్ గ్రామాలను ఎంపిక చేసి నిధులను మంజూరు చేశారు. ఆ పనులు ఉపాధి కూలీలతో చేపట్టారు.



చామనపల్లిలో ఏర్పాటు చేసిన శిలాపలకం



గ్రామంలో అభివృద్ధి చేసిన అమృత సరోవర్ చెరువులు

పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి : పీఆర్‌టీయు

కరీంనగర్ టౌన్, జూన్ 11: అనేక సంవత్సరాల నిరీక్షణ తర్వాత చేపడుతున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని పీఆర్‌టీయు తెలంగాణ జిల్లాశాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం పీఆర్‌టీయుటి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్రీనివాస్, కేతిరి తిరుపతిరెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వీఎస్ జనార్ధన్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విడుదల చేసిన నిబంధనలు, మార్గదర్శకాలకు అను గుణంగా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారద్శకంగా బదిలీలు నిర్వహించాలని కోరారు.

అర్బన్ బ్యాంకు సభ్యుల ఓటరు తుదిజాబితా విడుదల : సీఈవో

కరీంనగర్ టౌన్, జూన్ 11: ది కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లా సహకార శాఖ అధికారులు తుది ఓటరు జాబితాను విడుదల చేసిందని, ఆ జాబితాను బ్యాంకులో అందుబాటులో ఉంచినట్లు బ్యాంకు సీఈవో ఎన్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, జగిత్యాల బ్రాంచిలకు చెందిన సభ్యులు ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నయా లేదో తెలుసుకో వాలని సూచించారు. ఒకవేళ జాబితాలో తమ పేర్లు లేనట్లయితే ఈ నెల 21లోగా సరైన ఆధారాలతో బ్యాంకులో సంప్రదించి పేరు చేర్పించుకోవచ్చని అన్నారు. ఆ తర్వాత ఓటరు జాబితాలో పేరు చేర్చడం జరుగదని, సభ్యులు 9182317970 నెంబర్‌కు ఫోన్ చేసి ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చని, ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలన్నారు.

15 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ పోస్టులు మంజూరు : డీఈవో

కరీంనగర్ టౌన్, జూన్ 11: జిల్లాకు 15 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ పోస్టుల మంజూరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్ వివిఎస్ జనార్ధన్‌రావు తెలిపారు. స్పెషల్ ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్ ఉండి, కొత్తగా మంజూరైన స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టుకు డిగ్రీతోపాటు స్పెషల్ బీఈడీ, ఆర్‌సీఐలో నమోదు తప్పనిసరి ఉన్నవారు అర్హులని అన్నారు. అర్హత కలిగిన ఎస్‌జీటీలు బుధవారం ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అలాగే జిల్లాలో ఎస్‌జీటీల పదోన్నతుల సీనియార్టీ జాబితా, ఖాళీల వివరాలను డీఈవో కరీంనగర్ వెబ్‌సైట్‌లో పొందుపరచామని, ఉపాధ్యాయులు సీనియార్టీ చూసుకొని అభ్యంతరాలుంటే జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కల్వర్టు కష్టాలు తీరేదెన్నడు?

- వర్షాలు పడితే రాకపోకలు బంద్ • ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ప్రమాదకరంగా పెద్దచెరువు మత్తడి లోలెవల్ కల్వర్టు



గన్నేరువరం చెరువు వద్ద కల్వర్టుపై ప్రమాదకరంగా ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

గన్నేరువరం, జూన్ 11: ప్రతి యేటా వర్షాకాలం వచ్చిందంటే గన్నేరువరం మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని పెద్దచెరువు మత్తడి వద్ద ఉన్న లోలెవల్ కల్వర్టు ప్రమాదకరంగా మారి ప్రతి వర్షాకాలంలో రోడ్డుపై భారీగా నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు తమ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని రోడ్డుదాటే పరిస్థితి ఉంటుంది. గతంలో గన్నేరువరంలోని చెరువు వద్ద కల్వర్టుపై నీటి ప్రవాహంలో వాహనాలతో పాటు, ప్రయాణికులు కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. వర్షం పడిదంటే చాలు ఈమార్గం ప్రమాదాలకు నిలయంగా మారు తోంది. దీంతో మండల కేంద్రానికి బస్‌లు రాలేని పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంతో పాటు జంగపల్లి, పారువెల్ల గ్రామాల్లోని లోలెవల్ కల్వర్టులను హైలెవల్ కల్వర్టులుగా మార్చాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు పలుమార్లు నిరసనలు, ధర్నాలు చేశారు. మళ్లీ వర్షాకాలం ప్రారంభమైనందున కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి కల్వర్టుల వద్ద హైలెవల్ బ్రిడ్జిలను వెంటనే నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గన్నేరువరంలోని పెద్దచెరువు కల్వర్టు

15 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ పోస్టులు మంజూరు : డీఈవో

కరీంనగర్ టౌన్, జూన్ 11: జిల్లాకు 15 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ పోస్టుల మంజూరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్‌విఎస్ జనార్ధన్‌రావు తెలిపారు. స్పెషల్ ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్ ఉండి, కొత్తగా మంజూరైన స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టుకు డిగ్రీతోపాటు స్పెషల్ బీఈడీ, ఆర్‌సీఐలో నమోదు తప్పనిసరి ఉన్నవారు అర్హులని అన్నారు. అర్హత కలిగిన ఎస్‌జీటీ లు బుధవారం ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అలాగే జిల్లాలో ఎస్‌జీటీల పదోన్నతుల సీనియార్టీ జాబితా, ఖాళీల వివరాలను డీఈవో కరీంనగర్ వెబ్‌సైట్‌లో పొందుపరచామని, ఉపాధ్యాయులు సీనియార్టీ చూసుకొని అభ్యంతరాలుంటే జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు

- ప్రతి నెలా 20శాతం మేర పెంపు
- టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్



గణేశ్‌నగర్,జూన్ 11: విద్యుత్ వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా బిల్లుల చెల్లింపులు గణనీయంగా పెరుగు తున్నాయని, ప్రతి నెలా 20శాతం మంది ఎక్కువగా చెల్లింపులు చేస్తున్నారని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీజీ ఎన్‌పీడీసీఎల్ పరిధిలో మే నెలలో 13,2812 గృహ వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా 21.51 కోట్ల రూపాయలు చెల్లించా రన్నారు. ఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్, వెబ్‌సైట్: www.tgn-pdcl.com, గూగుల్ పే, ఫోన్ పే, పేటీ ఎం ద్వారా నెల వారీ విద్యుత్ బిల్లులు సులువుగా చెల్లించ వచ్చన్నారు. ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపుల కేంద్రానికి వెళ్లకుండా ఫోన్ ద్వారా సులువుగా చెల్లించవచ్చన్నారు. ఇప్పుడు కొత్తగా బిల్లు పైనే క్యూఆర్ కోడ్‌ను ముద్రించడం జరుగుతుందని మొదట ప్రయో గాత్మకంగా వరంగల్ సర్కిల్ కేంద్రంలో మట్టెవాడ ఈఆర్‌ఓ పరిధిలో ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలో కరీంనగర్ సర్కిల్‌లో కూడా ప్రారంభిస్తామని అన్నారు.వినియోగదారులకు సెల్ఫ్ రీడింగ్‌పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు భవిష్యత్తు మొత్తం డిజిటల్ పెమెంట్స్ ద్వారానే అన్ని కార్యకలాపాలు సాగుతుం టాయని అన్నారు. వినియోగదారులు తమ నెలవారీ విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని కోరారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

- బాల వికాస సంస్థ ప్రతినిధి, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వసంత

జమ్మికుంట, జూన్ 11: మహిళల ఆరోగ్య సంరక్షణకు మెనుస్ట్రువల్ కప్‌లను వాడాలని బాల వికాస సంస్థ ప్రతినిధి, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ దోవారి వసంత అన్నారు. జమ్మికుంటలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఆమెజాన్ వారి ఆర్థిక సహాయంతో బాల వికాస సంస్థ ఆద్వర్యంలో మెనుస్ట్రువల్ కప్‌ల ఉపయోగం, వ్యక్తి గత పరిశుభ్రతపై మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా 150మంది మహిళలకు మెనుస్ట్రువల్ కప్స్‌ను అందజేశారు. ఆనంతరం దోవారి వసంత మాట్లాడుతూ మానవ మనుగడను శాసించే ఓ సహజ ప్రక్రియ రుతుస్రావం అన్నారు. మహిళలు బాగుంటనే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. మహిళలు నెలసరి సమయంలో ప్యాడ్స్ ఉపయోగించడం వల్ల క్యాన్సర్‌తో పాటు రక రకాల వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. ప్యాడ్స్ భూమిలో కరుగడానికి అనేక సంవత్సరాలు పడుతుందని, ఒకవేల కాల్చితే పర్యవరణ సమస్య తలెత్తుతుందని చెప్పారు. మెనుస్ట్రువల్ కప్స్ ఆరోగ్యానికి ఎంతో మంచివన్నారు. మహిళల ఆరోగ్యం, డబ్బు, పర్యావరణ పరిరక్షణ, సౌకర్యం, ఈ నాలుగు అంశాలను దృష్టిలో పెట్టుకొని మెనుస్ట్రువల్ కప్స్‌ను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో బాల వికాస సంస్థ సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన, కో-ఆర్డినేటర్ కె సుమలత, ఎ స్వాతి, శాస్త్రవేత్త ప్రశాంతి పాల్గొన్నారు.

మోటార్ల విద్యుత్ తీగల చోరీ

మల్యాల, జూన్ 11: మండలంలోని వరదకాలువకు రైతులు అమర్చుకున్న పంప్‌మోటార్ల విద్యుత్ తీగలు కొన్ని రోజులుగా చోరీకి గురవుతున్నాయి. రాంపూర్ నుంచి సర్వాపూర్ శివారుల వరకు వందలాదిగా పంప్‌మోటార్లను అమర్చుకొని రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇటీవల సాగు పనులు ప్రారంభం కాగా రెండు రోజులుగా మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతం నుంచి సర్వాపూర్ వరకు గల పంప్‌మోటార్ల విద్యుత్ తీగలను కట్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళుతున్నట్లు రైతులు తెలిపారు. గతంలోనూ నూకపల్లి శివారులో విద్యుత్‌తీగలు, పంప్‌మో టార్లలోని కాపర్ తీగలు కూడా చోరీకి గురి కాగ అప్పట్లో కొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల మళ్లీ పెరుగడంతో ఆందోళన చెందుతున్నారు.

గంజాయి కాల్చివేత



గంజాయిని తగులబెడుతున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, జూన్ 11: సిరిసిల్ల పట్టణం రగుడు శివారులోని డంప్ యార్డు వద్ద జిల్లా డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో 36 కిలోల 436 గ్రాముల గంజాయిని కాల్చివేశారు. మంగళవారం రగుడు డంప్‌యార్డువద్దకు జిల్లా వ్యాప్తంగా 41 కేసులలో స్వాధీన పరుచుకున్న 36.436 కిలోల నిషేధిత గంజాయిని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో కాల్చేసి బూడిద చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వంటి మ త్తు పదార్థాలను రవాణాచేసే వారిపై పీడీ యాక్ట్ అమలు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖరరెడ్డి, టౌన్ సీఐ రఘుపతి, ఆర్ఐ యాదగిరి పాల్గొన్నారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూన్ 11: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,350 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 20మంది రైతులు 275క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు ఒక క్వింటాల్ పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,350, కనిష్ఠ ధర 4.500 రూపాయలు చెల్లించారు.

ఆరెపల్లిలో చోరీ

వేములవాడ టౌన్, జూన్ 11: ఆరెపల్లిలో సోమ వారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆరె పల్లికి చెందిన మంజెడి రాజయ్య తన ఇంటి ముందు నిద్రిస్తున్నాడు. దొంగలు ఇంట్లోకి చొరబడి రూ.15 వేల నగదు, టీవీ, సెల్ ఫోన్ ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన నడిగొట్ల లింగయ్యకు చెందిన సెల్‌ఫోన్‌ను, నడిగొట్ల శ్రీనివాస్‌కు చెందిన నీటి పంపును దొంగతనం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

200 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సుల్తానాబాద్, జూన్ 11: సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి గ్రామంలో బేడబుడిగె జంగాల కాలనీలోని ఒకరి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసి ఉన్న రెండు వందల క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు మంగళవారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన వానరాసి నంబయ్య అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి ఉంచారన్న సమాచారం మేరకు అధికారులు దేవునిపల్లి గ్రామంలో దాడులు నిర్వహించి బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా బియ్యం సేకరించే వారు, బుడిగె జంగాల కాలనీ వాసులు అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో సివిల్ సప్లై అధికారులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ శ్రావణ్ కుమార్ పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకొని అధికారులకు రక్షణ కల్పించారు. దాంతో అధికారులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకునే కార్యక్రమాన్ని కొనసాగించారు. బియ్యం అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అట్టి బియ్యాన్ని సుల్తానాబాద్ లోని ఎం ఎల్ ఎస్ పాయింట్ గోదాముకు తరలించారు. ఈ దాడుల్లో జిల్లా సివిల్ సప్లై అధికారులు ప్రేమ్ కుమార్, పౌరసరఫరాల సంస్థ డిప్యూటీ తహసీల్దారులు శంకర్ , రవీందర్ రాథోడ్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు మల్లికార్జునరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● **సైదాపూర్‌లో..**

సైదాపూర్: మండలంలోని సర్వాయిపేట గ్రామం నుంచి అక్రమంగా ట్రాలీలో తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ పట్టుకొన్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గంట వెంకటేష్ అనే వ్యక్తి మంగళవారం ఉదయం ట్రాలీలో రేషన్ బియ్యం తీసుకొని వెళ్తుడగా పట్టుకొని వాహనాన్ని సీజ్ చేసీ వెంకటేష్‌పై కేసు నమోదు చేశామన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆరోగ్యం హెచ్చరించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి పట్టివేత

▸▸ మంథని, మద్దులపల్లికి చెందిన ఇద్దరు యువకుల అరెస్టు ▸▸ వివరాలు వెల్లడించిన సీఐ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

మంథని, జూన్ 11: గంజాయి మత్తుకు బానిసై తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గంజాయిని క్రమంగా రవాణా చేస్తూ, గట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు కొనసాగిస్తున్న ఇద్దరు యువలకును మంథని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు మంథని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఆదేశాల మేరకు.. మంథని బస్ డిపో వద్ద మంథని ఎస్ఐ వెంకటకృష్ణ, సీపీలు దుబ్బాసి రమేష్, ఐతు లుకాలు పెట్రోలింగ్ చేస్తుండగా ఉదయం 11 గంటల సమయంలో డిపో చౌరస్తాలో ప్లాస్టిక్ బ్యాగ్‌తో సహా ఉండి అనుమానాస్పదంగా ఉన్న క్రమంలో యువకులను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ద్వారా పంచానామా నిర్వహించి బ్యాగ్‌లో ఉన్న గంజాయిని తూకం వేయించగా 1కిలో 70 గ్రాములు ఉండగా దాని విలువ రూ.26,750 ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును మంథని పోలీసులు విచారించగా మంథనికి చెందని పుల్లె ప్రశాంత్, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మద్దెలపల్లికి చెందిన చికినారపు సంతోష్‌లను నిందితులుగా తేలిందన్నారు. వీరి పై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. యువత మత్తు కోసం గంజాయి, మద్యం లాంటి వాటికి బానిసై తమ జీవితాలను నాశనం చేసుకొవ ద్దన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల కదలిక పై దృష్టి సారించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై స్థానిక పోలీసులకు లేదా 100 డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభను కనబర్చిన మంథని ఎస్ఐ వెంకటకృష్ణ, పీసీలు దుబ్బాసి రమేష్, ఐతు లూకాలను గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.

భక్తులతో పోటెత్తిన కొండగట్టు

- ఇబ్బందులు కలుగకుండా అధికారుల చర్యలు


ఆలయ ఆవరణలో భక్తజనం

మల్యాల, జూన్ 11: కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోవడంకు బారులు తీరగా అంజన్నను దర్శించు కొని ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి దర్శనంకు గంట సేపు పైగా సమయం పట్టింది. విద్యార్థుల వేసవి సెలవులు ముగుస్తుండ డం తో తరలివచ్చిన భక్తులు అంజన్న దర్శనం అనంతరం బేతాళుడు, శ్రీరాముడిని కూడా దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. వై జంక్షన్ వద్ద వాహనాలతో భక్తుల రాకపోకలకు అసౌకర్యంగా మారింది. భక్తులు వచ్చిన వాహనాలతో ఘాట్‌రోడ్డు నిండిపోయింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందుతుంది

-పీసెట్ కన్వీనర్ రాజేష్‌కుమార్



మాట్లాడుతున్న పీసెట్ కన్వీనర్ రాజేష్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 11: క్రీడలతో దేహదారుఢ్యం, శారీరక పటుత్వం లభిస్తాయని ఫిజికల్ ఎడ్యుకేషనల్ కమాన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీసెట్) కన్వీనర్ రాజేష్‌కుమార్ అన్నారు. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో మంగళవారం తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్టు శారీరక పరీక్షలను రెండో రోజు ఆయన ప్రారంభించి మాట్లాడారు. 470మంది అభ్యర్థులు శారీరక సామర్థ్య పరీక్షలలో పాల్గొన్నారని తెలిపారు. అనంతరం హాజరైన అభ్యర్థులకు వంద మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, హైజంప్‌లతో పాటు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ క్రీడాంశాలలో నైపుణ్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పీడీ జె ప్రభాకర్ రావు, శాతవాహన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ డాక్టర్ నిజాముద్దీన్ మునవర్, శాతవాహన యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ విజయ్‌కుమార్, పీడీలు శ్రీధర్ రావు, నాగేశ్వర్‌రావు, బాలరాజు, పన్యాల శ్రీనాథ్‌రెడ్డి, రవీందర్, అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చేందుకు వెళ్లి నిప్పంటుకొని వృద్ధుడి మృతి


భూమయ్య(ఫైల్)

రాయికల్, జూన్ 11: జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో వరి కొయ్యలను కాల్చేందుకు వెళ్లి నిప్పంటుకొని ఓ వృద్ధుడు మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రాయికల్ పట్టణానికి చెందిన రైతు తోపారపు నడిపి భూమయ్య(70) సోమవారం సాయంత్రం తన పంట పొలంలో వరి కొయ్యలను కాల్చేందుకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. వరి కొయ్యలకు నిప్పు పెట్టి అక్కడే ఉండగా కొయ్యలు కాలుతూ ప్రమాదవశాత్తు వృద్ధుడికి అంటుకోవడంతో శరీరం పూర్తిగా కాలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి నుంచి వెళ్లిన భూమయ్య తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

పరస్పర దాడులు.. నలుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్11: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాయిబాబా కమాన్ వద్ద ఇరు వర్గాలు పరస్పరం దాడులకు దిగి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన సంఘటనలో నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. మండలంలోని రాజన్నపేట గ్రామానికి చెందిన నమిలికొండ బాలయ్య నమిలికొండ రాజవ్వ, నమిలికొండ పర్శయ్య, నమిలికొండ నిర్మల ఒకరిపై ఒకరు దాడులకు ఎగబడ్డారు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకుని అడ్డుకునేందుకు యత్నించారు. ఎంత చెప్పినా వినకపోవడంతోపాటు రహదారిపై వెళ్లే ప్రజలకు ఇబ్బందులు కలిగించారు. హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణ కాత్యాయనీదేవి వ్రతం

మెట్‌పల్లి, జూన్, 11: పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో కాత్యాయదేవి కల్యాణవ్రతాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొంగుబంగారంగా కొలిచే పెద్దమ్మ ఆలయంగా వెలి సిన బంగారు పెద్దమ్మ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వ్రతాలను ఆలయంలో చేపట్టారు. ఉదయం నుంచి బంగారు తల్లి అమ్మవారికి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు, లక్ష్మీదేవి పూజలు ఆలయ పురోహితుడు మదన్‌శర్మ నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులతో భక్తులు పెద్దమ్మ ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. సర్ప దోష నివారణ, కల్యాణ, సంతాన దోషాల పరిహారం వంటి కార్యక్రమాలను చేయించారు. భక్తులు ఆలయం సమీపంలోని శ్రీ ఐశ్వర్యలక్ష్మీ, గోశాలలోని గోమాతలకు పూజలు చేశారు.


కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

వేములవాడలో యువకుడి హఠాన్మరణం

వేములవాడ టౌన్, జూన్ 11 : కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న ఆలయానికి వచ్చి న ఓ యువకుడు తీవ్ర ఒత్తిడికి లోనైన హఠన్మారణం పొందిన సంఘటన వేములవాడ పట్టణంలో మంగళవారం విషాదాన్ని నింపింది. జనగామ జిల్లాకు చెందిన బొట్ల ఇస్తారి, లక్ష్మీ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాజన్న ఆలయానికి వచ్చారు. పెద్ద కుమారుడి కూతురి పుట్టు వెంట్రుకలు తీసి రాజన్నను దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం చిన్న కుమారుడు బొట్ల వినయ్‌కుమార్(24)కు ఛాతిలో నొప్పిగా ఉండడంతో గదిలోనే ఉంచి కుటుంబ సభ్యులు బద్ది పోచమ్మ దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో ఛాతీలో నొప్పి కాస్త తీవ్రం కావడంతో మెడికల్ షాపునకు వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్ కొను గోలు చేసి వస్తుండగా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వినయ్ మృతి చెందినట్లు పేర్కొన్నారు.


వినయ్‌కుమార్(ఫైల్)

ఘనంగా రేణుక ఎల్లమ్మ బోనాలు

మెట్‌పల్లి, జూన్ 11: పట్టణంలోని రేణుక ఎల్లమ్మ బోనాలు గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వ హించారు. ఆలయంలోని అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. బోనాల జాతరకు మెట్‌పల్లి చుట్టు పక్క గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్యనారాయణలు పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు బోనం ఎత్తుకుని పట్టణంలోని చావిడి వద్ద ఉన్న భూమాత ఆలయం నుంచి డప్పు చప్పులతో శివసత్తుల పూనకంలో ఊరేగింపుగా ఆలయానికి తరలి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే భక్తులతో కలిసి బోనం నెత్తిన ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. జాతరలో గౌడ శెట్టి, పంబాల పూజారుల ఎల్లమ్మ వేషధారణ, పోతురాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గౌడ కుల సంఘం అధ్యక్షుడు పూదరి సుధాకర్‌గౌడ్, పూదారి నర్సాగౌడ్, చెర్లపల్లి మీనా, చెర్లపల్లి సుఖేందర్‌గౌడ్, ఎనుగందుల శ్రీనివాస్, వనజ, చెర్లపల్లిలక్ష్మీ, రాజేశ్వర్‌గౌడ్, పుల్ల చిన్నయ్యగౌడ్, పూదరి శ్యాంసుందర్‌గౌడ్, పూదరి రామ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, ఏనుగందుల గోపిగౌడ్, భక్తులు, కుల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


మెట్‌పల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామంలో రేణుక ఎల్లమ్మ బోనాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డోలు వాయిద్యాల మధ్య బోనాలతో మహిళలు గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. బోనాలు నెత్తిన పెట్టుకోని గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడికి చేరుకోని బోనాలు, ఒడి బియ్యాన్ని సమర్పించారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పైడిపల్లి ఆనందం, కౌన్సిలర్ బొంగోని వీరన్న, అయోధ్య, బుర్ర సంపత్, పైడిపల్లి మల్లిఖార్జున్, పొన్నం వెంకటరమణ, పైడిపల్లి పెద్ద భీమయ్య, బొంగోని సదానందం, పైడిపల్లి తిరుపతి, గట్టు సదయ్య, పంజాల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముడుపుల సామగ్రి వేలం

మల్యాల, జూన్ 11: కొండగట్టులో ఇటీవల జరిగిన పెద్ద హనుమాన్ జయంత్యుత్సవాల సందర్భంగా దీక్షపరులు సమర్పించిన ముడుపుల సామగ్రికి దేవస్థానం అధికారులు మంగళవారం వేలం నిర్వహించారు. ఈ వేలంలో మిశ్రమ బియ్యం కిలో రూ.23 చొప్పున, ఇత్తడి గంటలు కిలోకి రూ.440 చొప్పున, ఎండు కుడుకలు కిలో రూ.70చొప్పున వేలంలో పాల్గొన వారు ధర నిర్ణయించడంతో వాటిని ఖరారు చేశారు. మాలలకు రూ. 3.66లక్షలు, కొబ్బరికాయలకు రూ.60వేలు పలికినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, చంద్ర శేఖర్ ఆలయ అధికారులు తదితరులు ఈ వేలం కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో అందని సెల్ సేవలు !

● భక్తులకు అందుబాటులో బీఎస్ఎన్ఎల్ మాత్రమే
● ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన శూన్యం

మల్యాల, జూన్ 11: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో సెల్ సేవలు భక్తులకు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెల్ కంపెనీలు కొండపైన సేవలు అందించకపోవడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. అంజన్న దర్శనానికి గాను ఇక్కడకు నిత్యం వేలల్లో, ప్రతి మంగళ, శనివారాల్లో ఇరవై వేలకు పైగా హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా లక్షలాదిగా భక్తులు వస్తూంటారు. ఇక్కడ బీఎస్ఎన్ఎల్ సెల్‌వన్ తప్ప మిగితా కంపెనీల సెల్ సేవలు లేకపోవడంతో ఊసురుమంటున్నారు. కొండపైన గల బీఎస్ఎన్ఎల్ సేవలు కూడా అంతంతమాత్రమే కాగ రద్దీ రోజుల్లో సామర్థ్యం మించిపోవడంతో సేవలకు అంతరాయం ఏర్పడడంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. ఈ రోజుల్లో ఉక్కువ మంది ప్రైవేట్ కంపెనీల సెల్‌సేవలు పొందుతుండగా ఇక్కడ వారికి సంబంధించిన ఎలాంటి సెల్‌సేవలు అందుబాటులో లేవు. దీంతో కొండపైకి వచ్చే భక్తుల సెల్‌ఫోన్‌లు ఇక్కడకు చేరుకోగానే మూగబోతున్నాయి. కొండపైన చిన్నారులు తప్పిపోయే సంఘటనలు, బందువులు, కుటుంబసభ్యులు ఇతరాత్రా సమాచారం తెలుసుకోవడం భక్తులకు కష్టంగా మారింది.


కొండపైన ఉన్న సెల్‌వన్ టవర్

● **సేవలన్నీ ఆన్‌లైన్.. సెల్ ఆఫ్‌లైన్**

సెల్‌ఫోన్ ఆధారంగానే సేవలన్నీ ప్రజలకు అందుబాటులోకి రాగ కొండపై సెల్‌సేవలు లేకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇక్కట్లు పడుతున్నారు. ఇక్కడకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. ఈ మధ్య కాలంలో డబ్బుల చెల్లింపులు, ఇతరాత్ర లావాదేవీలు అంతా సెల్‌ఫోన్ ఇంటర్‌నెట్ నుంచే జరుగుతున్నాయి. నగదు లేకుండానే అన్ని జరుగుతుండగా కొండపైన కూడా భక్తులు దుకాణాలలో వస్తువులు, పూజసామగ్రి తదితర కొనుగోళ్లలో యూపీఐ పేమెంట్స్ చేస్తుంటారు. అయితే ఇక్కడ బీఎస్ఎన్ఎల్ మినహా మిగిత సెల్ సేవలు అందుబాటులో లేకపోవడంతో డబ్బుల కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో భక్తులు సెల్ సిగ్నల్స్ కోసం, చెట్లు, బండరాళ్లు ఎక్కాల్సిన దుస్థితి నెలకొంది. సెల్‌సేవలు విస్తృతంగా భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి అధి కారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఐద్వా శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి

భగత్‌నగర్, జూన్ 11: కరీంనగర్‌లో జూలైలో జరిగే ఐద్వా రాష్ట్ర శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి అన్నారు. మంగళవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జరిగిన ఐద్వా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం సమావేశంలో ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో మహిళాసమస్యల పట్ల ఉధృతమైన పోరాటాలు నిర్వహించడానికి రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు కరీంనగర్‌లో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కె.స్వరూప, దేవేంద్ర, రాజారాణి తదితరులు పాల్గొన్నారు.

వీడియో జర్నలిస్టుకు ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న టీఎన్‌జీవో నాయకులు

సుభాష్‌నగర్, జూన్ 11: రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న మైత్రీ చానల్ వీడియో జర్నలిస్టు నరేష్‌ను మంగళవారం టీఎన్‌జీవో అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం పక్షాన సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి రూ. 5వేల అందించారు. ఉద్యోగులు తమకు తోచిన సహాయాన్ని అందించాలని శ్రీనివాస్‌రెడ్డి కోరారు. పరామర్శించిన వారిలో పట్టణ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి పాల్గొన్నారు.

కేంద్రమంత్రి 'బండి'కి మున్నూరుకాపు సంఘం శుభాకాంక్షలు

కరీంనగర్ టౌన్, జూన్ 11: కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు జిల్లా మున్నూరుకాపు సంఘం శుభాకాంక్షలు తెలిపింది. ఈమేరకు మంగళవారం స్థానిక మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మంత్రి సంజయ్‌కుమారుకు సంఘం పక్షాన అభినందనలు తెలిపారు. కేంద్ర మంత్రి వర్గంలో మున్నూరు కాపు బిడ్డకు అవకాశం కల్పించినందుకు ప్రధానమంత్రి మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాలకు కృతజ్ఞతలు తెలిపారు. బండి సంజయ్ ద్వారా దేశానికి, రాష్ట్రానికి మేలు జరగాలని, ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈసమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శులు నలువాల రవీందర్‌పటేల్, చల్ల హరిశంకర్, ఉపాధ్యక్షులు కర్ర రాజశేఖర్, పసుల మహిపాల్, హాస్టల్ ఇంచార్జి ముప్పిడి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు

భగత్‌నగర్, జూన్11: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా నియమితులు కావడం పట్ల 59వ డివిజన్ సుష్మస్వరాజ్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు సంబురాలు నిర్వహించి, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డెడ్డి శ్రీనివాస్ (బాలు) ఆధ్వర్యంలో 163, 64 బూత్ అధ్యక్షుడు దయ్యాల కరుణాకర్, 166 బూత్ అధ్యక్షుడు దయ్యాల మల్లేశం, డివిజన్‌బీజేపీ నాయకులు ఒల్లెం సంజీవ్‌కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ బాగోతం ఆదర్శ్, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకుడు

భగత్‌నగర్, జూన్ 11: కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కరీంనగర్ బీజేపీ నాయకుడు రాపర్తి ప్రసాద్ ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా నియమితులైన సందర్భంగా మంగళవారం ఢిల్లీలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం



మానకొండూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మానకొండూర్, జూన్ 11: మానకొండూర్ మండలంలో బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానునున్నాయి. మండలంలో 42 ప్రాథమిక పాఠశాలలు, మూడు ప్రాథమికోన్నత పాఠశాలలు, 12 ఉన్నత పాఠశాలున్నాయి. ఒకటి నుంచి పదో తరగతి వరకు అన్ని పాఠశాలలో 3,257 మంది విద్యార్థులు ఉన్నారు. రాష్ట్రప్రభుత్వం జూన్ 3నుంచి 19 వరకు ప్రవేశపెట్టిన బడిబాట కార్యక్రమంలో నూతనంగా 146 మంది విద్యార్థులు తమ పేరును నమోదు చేసుకున్నారు. అయితే ప్రాథమిక పాఠశాలల్లో 8మంది, ఉన్నత పాఠశాలల్లో 10 మంది ఉపాధ్యాయులు ఖాళీలున్నాయి. కాగా మండలంలో 24 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను అమ్మ ఆదర్శ పథకం కింద ఎంపిక చేసింది. ఈ పథకం కింద తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం, గదుల మరమ్మతులనును చేపట్టేందుకు రాష్ట్రప్రభుత్వం ఆయా పాఠశాలలకు నిధులను కేటాయించింది. ఈ పనులన్నీ జూన్ 11 వరకు పూర్తి కావాలని ఆదేశాలున్నా 80 శాతం మేరకు పనులు పూర్తి అయ్యాయి. సంబంధిత అధికారులు పనులు త్వరగా పూర్తి చేయాలని పోషకులు కోరుతున్నారు.

పిల్లలను సర్కార్ బడికి పంపించాలి

ఇల్లందకుంట, జూన్ 11: పిల్లలను సర్కార్ బడికి పంపించాలని ఉపాధ్యాయులు కోరారు. మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి గడప గడపకు తిరుగుతూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని పిల్లలకు ఉచితంగా బుక్స్, డ్రెస్సులు, భోజనం, నాణ్యమైన విద్యను కేవలం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇక్కడ చదివే పిల్లలకు విద్యతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నతమైన శిఖరాలు అధిరోహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తాగునీటికి కటకట

మానకొండూర్, జూన్ 11: మానకొండూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాగునీటి సమస్య నెలకొంది. ఆరు నెలలుగా సిబ్బందితో పాటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్య కేంద్రంలో బోరు నుంచి నీటి సరఫరా కొనసాగుతుండేది, రాత్రి వేళల్లో బోరుకు ఉన్న విద్యుత్ వైరును మూడు సార్లు గుర్తు తెలియని వారు దొంగిలించుకపోవడం వల్ల అప్పటి నుంచి ఆరు నెలలుగా నీటికి ఇబ్బంది నెలకొంది. అధికారులు చొరువ తీసుకొని నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

క్రీడాకారిణికి సన్మానం

గంగాధర, జూన్ 11: మండలంలోని వెంకటయ్యపల్లికి చెందిన రావుల శ్రీహసిని జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికవడంతో మంగళవారం ఆమెను సన్మానించారు. ఈ నెల 18నుంచి నేపాల్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో రావుల శ్రీహసిని పాల్గొననుంది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేఘరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, జూన్ 11: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం ఉన్న చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తూ కొత్త చట్టాలను తీసుకురావాలన్నారు. రైతు ఆత్మహత్య లను అరికట్ట వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతులకు పెట్టుబడి రుణాలు ఇవ్వాలన్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో బ్యాంకుల ముందు ధర్నాలు నిర్వహిస్తామని అధిక సంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు ఎం.వాసుదేవరెడ్డి, జిల్లా నాయకులు బాసిర సంపత్‌రావు, శీలం అశోక్, గుండేటి వాసుదేవ్, వరాల రవికుమార్, పిట్టల తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూన్ 11: జిల్లాలోని గ్రూప్-2 మరియు గ్రూప్-3 పరీక్ష రాయనున్న మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే 9849152516 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

'కొత్త దారి' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్

కరీంనగర్ కల్చరల్, జూన్ 11: కరీంనగర్‌కు చెందిన కవి, పీజీ హెడ్మాస్టర్ పుప్పాల కృష్ణగోపాల్ రాసిన 'కొత్త దారి' పుస్తకావిష్కరణను మంగళవారం ఉత్తర కాశిలోని కాశీ విశ్వనాథ మందిరంలో పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ ఆవిష్కరించారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ రఘు పుస్తక సమీక్ష చేశారు. పుస్తకానికి శ్యాంప్రసాద్‌లాల్ ముందు మాట రాశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వాసులు పలువురు పాల్గొన్నారు.

గో వధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి



డీసీపీ లక్ష్మీనారాయణకు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నేతలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 11: గో వధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని గో రక్షా విభాగం, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్ డీసీపీ, ఎంఆర్‌ఓతో పాటు వివిధ పోలీస్ స్టేషన్లలో వినతిపత్రం సమర్పించారు. ఆర్థిక వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయం, ఆరోగ్యరక్షణకు ఆధారమైన గోమాతను, గో సంతతిని విచ్చల విడిగా వధించి మాంసాహారంగా ఉపయోగించుకుంటున్నారని, వేలాది టన్నుల గో మాంసాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని పేర్కొన్నారు. గో మాంసం అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విభాగ్ గో రక్షా ప్రముఖ్ వుట్కూరి రాధాకృష్ణారెడ్డి, వీహెచ్‌పి జిల్లా కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్, జిల్లా సహ కార్యదర్శి తోట రాజేందర్, మిట్టపల్లి భగవాన్‌రావు, భజరగ్‌దళ్ జిల్లా కో కన్వీనర్ కన్నం శంకర్, నగర కన్వీనర్ గుజ్జేటి రాజేందర్, రంజిత్, వంశి, హరీంద్ర తదితరులు పాల్గొన్నారు.

'కౌశిక్‌రెడ్డి చిల్లర రాజకీయాలు మానుకోవాలి'

కరీంనగర్ అర్బన్, జూన్ 11: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చిల్లర రాజకీయాలు మానుకోవాలని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కౌశిక్‌రెడ్డి చౌకబారు ఆరోపణలు మానుకుని, దమ్ముంటే బీజేపీని ప్రశ్నించాలన్నారు. శవ రాజకీయాలు చేసిన కౌశిక్‌రెడ్డి పొన్నం ప్రభాకర్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇసుక తరలింపులో ఎన్జీటీ ఆదేశాలను, గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పులను తుంగలో తొక్కింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ఆయన ప్రశ్నించారు.

'ధరణి సమస్యలను పరిష్కరించాలి'

-ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్



మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

సుభాష్‌నగర్, జూన్11: ధరణి సమస్యలను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. ధరణి సమస్యల పరిష్కారానికి 10రోజుల డెడ్‌లైన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పెట్టినా పరిష్కారం కాలేదని ఆయన అన్నారు. కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు ఆదేశించినప్పటికీ లక్షకు పైగా ఫైల్స్ ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. మార్చి ఒకటి నుంచి 17వరకు స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం ద్వారా ధరణి సమస్యల అర్జీలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు, ముఖ్యంగా జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ వారు తగు చర్యలు తీసుకోలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన సందర్భంగా స్పెషల్ డ్రైవ్ ఆపి సామాన్య పద్ధతిలో ఫైల్స్‌ను పరిష్కరించాలని ఆదేశించినప్పటికీ అవి జరగలేదన్నారు. మే 13 పోలింగ్ తర్వాత రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి జూన్ లోపు ధరణి సమస్యలన్నీ పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ ఆదేశాలను పాటించడం లేదని, ధరణి బాధితుల అడుగుతున్నారన్నారు. ధరణి కార్యక్రమాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద కుట్రతో ఏర్పాటు చేసిందన్నారు. 2023 జూన్ 10న ధరణి చీడ పీడ అని సదస్సును ఏర్పాటు చేసినట్లు, టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించాలని ప్రజలకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత అధికారులు ప్రభుత్వానికి సహకరించడం లేదని ఆయన ఆరోపించారు. పెద్దఎత్తున ప్రజలు, ప్రజాసంఘాలు, రెవెన్యూ అధికారులపై తిరుగుబాటు చేస్తారని అన్నారు. ఇప్పటికైనా ధరని సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని ప్రజామిత్ర కొరివి వేణుగోపాల్ డిమాండ్ చేశారు.

మంత్రిపై ఆరోపణలు చేస్తే ఊరుకోం

- కౌశిక్‌రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్



మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, జూన్ 11: ఆధారాలు లేకుండా మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ హెచ్చరించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్టీపీసీ బూడిద ప్రాజెక్టు వ్యయం రూ.40కోట్లు అయితే మంత్రి పొన్నం ప్రభాకర్ రూ. 100 కోట్లు స్కామ్ చేశాడని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కేరాఫ్ అడ్రస్‌గా మారాడన్నారు. బూడిదతో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రాజకీయం చేయడంతో ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో మానేరును చెరబట్టి వందలాది లారీల ఇసుక పోతుంటే కౌశిక్‌రెడ్డి ఎందుకు మాట్లాడ లేదన్నారు. సెంటిమెంట్ డైలాగ్‌లు కొట్టి గెలిచిన కౌశిక్‌రెడ్డికి మాట్లాడే అర్హత లేదన్నారు. ఎమ్మెల్యే నిరాదరణమైన వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేదని హెచ్చరించారు. సమావేశంలో పొనగంటి మల్లయ్య, సొల్లు బాబు, కొలిపాక శంకర్, తిరుపతిరెడ్డి, తౌసీఫ్, సందమల్ల బాబు, కాజీపేట శ్రీనివాస్, పుష్పలత, లావణ్య, తిరుపతి, సదయ్య, మల్లయ్య, రాజేశ్వర్‌రావు, రాధ, సుశీల, లక్ష్మి, కరిమా, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపాధి అవకాశాలు

హుజూరాబాద్‌రూరల్, జూన్ 11: ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. సింగాపూర్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఫైనలియర్ విద్యార్థులకు జూనియర్లు వీడ్కోలు కార్యక్ర మాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య, ఈఈ విభాగాధిపతి డాక్టర్ యోగేష్ పుండలిక్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వేణుగోపాల్, కళాశాల అకాడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ మల్లయ్య, మెకానికల్ ఇంజనీరింగ్ అధిపతి డాక్టర్ ఎంవీ సతీష్‌కుమార్, ప్రవీణ్ కుమార్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

శంకరపట్నం, జూన్ 11: మండలంలోని కేశవపట్నంలో శ్రీరేణుక ఎల్లమ్మ బోనాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎల్లమ్మతల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

వారసంతలో వసతులు కల్పిస్తాం

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

గన్నేరువరం, జూన్ 11: మండల కేంద్రంలోని జీపీ కాంప్లెక్స్, వారసంతలలో కనీస వసతులు కల్పించకుండా వేలంపాటను నిర్వహిస్తే అడ్డుకుంటామని సీపీఐ నాయకులు చేసిన వ్యాఖ్యలను 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి నర్సింహారెడ్డి వసతులు కల్పిస్తామని తెలిపారు. జీపీ కాంప్లెక్స్, వారసంతల వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

రెండు లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు

- సహకార సంఘాలకు సుమారు రూ. 66లక్షల ఆదాయం



చొప్పదండి సహకార సంఘం

చొప్పదండి, జూన్ 11: మండలంలోని సహకార సంఘాల ద్వారా రెండు లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు చేశారు. ధాన్యం పెద్ద ఎత్తున కొనుగోలు చేయడంతో మండలం లోని చొప్పదండి, ఆర్నకొండ సహకార సంఘాలకు అదనపు ఆదాయం లభించనుంది. కొనుగోలు సంస్థలకు పౌరసరఫరాల శాఖ క్వింటాలుకు 32 రూపాయల చొప్పున కమీషన్ చెల్లిస్తోంది. చొప్పదండి సహకార సంఘం ఆధ్వర్యంలో లక్షా25వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఈ కొనుగోళ్లపై సుమారు 40 లక్షల రూపాయల వరకు కమీషన్ రూపంలో ఆదాయం లభించనుంది. ఆర్నకొండ సహకార సంఘం ఆధ్వర్యంలో 82,500 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు.. దీనిపై 26 లక్షల40 వేల వరకు ఆదాయం సమకూరింది. తమ పరిధిలోని రైతులతో పాటు ఇతరుల ధాన్యం కూడా కొనుగోలు చేశారు. ఈ కొనుగోళ్లపై కమీషన్ రూపంలో భారీ స్థాయిలో ఆదాయం రెండు సంఘాలకు లభించింది. చొప్పదండి సహకార సంఘం ఆధ్వర్యంలో రుక్మాపూర్, కాట్నపల్లి, చాకుంట, భూపాలపట్నం, వెదురుగట్టు, గుమ్లాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. ఆర్నకొండ సంఘం ఆధ్వర్యంలో ఆర్నకొండ, రాగంపేట, పెద్దకుర్మపల్లి, చిట్యాలపల్లి, మంగళపల్లి గ్రామాల్లో కొనుగోళ్లను చేపట్టారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి హాజరుకానున్న బండి సంజయ్

భగత్‌నగర్, జూన్ 11: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాజరు కానున్నారు. మంగళవారం రాత్రి విజయవాడకు బయలుదేరి వెళ్లారు. బుధవారం ఉదయం నిర్వహించనున్న చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కేంద్ర మంత్రి తిరిగి ఢిల్లీ వెళ్లనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్ జూన్ 11: నగరంలో కొత్త విద్యుత్ లైన్, పనుల్లో భాగంగా బుధవారం వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, ఏ డి ఈ, సాయినేని నరేందర్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు, వెంకటేశ్వర ఫీడర్‌లో ఉదయం 9గంటల నుండి 10:30 వరకుప్రభావిత ప్రాంతాలు సాధన స్కూల్ ప్రాంతం, బిజెపి పార్టీ కార్యాలయ ప్రాంతం, పాక్షిక జ్యోతినగర్, వెంకటేశ్వర ఆలయ ప్రాంతం.వరలక్ష్మి ఫీడర్‌లో ఉదయం 10:45 నుండి మధ్యాహ్నం 12:15 వరకురెడ్డి ఫంక్షనల్ హాల్ వెనుక వైపు, వరలక్ష్మినగర్, పాక్షిక సీతారాంపు ప్రాంతం సమీపంలో ప్రభావిత ప్రాంతాలు. డాక్టర్ స్ట్రీట్ ఫీడర్‌లో మధ్యాహ్నం 3:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రభావిత ప్రాంతాలు రాజాథియేటర్ ప్రాంతం, శ్రీదేవి ఆసుపత్రి ప్రాంతం, మంచిర్యాల్ ఎక్స్ రోడ్, బ్రూమ్ రెడ్డి హాస్పిటల్ రోడ్.వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేసవి సెలవులను పొడిగించాలి

కరీంనగర్ టౌన్, జూన్ 11: ఎండల తీవ్రత ఇంకా అధికంగా ఉన్నందున పాఠశాలలకు ఇచ్చిన సెలవులను ఈనెల 12 నుంచి మరో ఐదురోజులపాటు 17వ తేదీ వరకు పొడగించాలని ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఎండల తీవ్రత, వేడిమిని పిల్లలు తట్టుకోలేక అనారోగ్యాలకు గురవుతారని, మానవతతో ఆలోచించి సెలవులను పొడగించాలని కోరారు.

ఫొటోగ్రాఫర్ల ఆందోళన



కరీంనగర్‌లో ఆందోళన చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

గణేశ్‌నగర్, జూన్ 11: యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం పుట్టపాక గ్రామంలో ఓ వేడుక కవర్ చేస్తున్న ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండిస్తూ కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో మంగళవారం ఫొటోగ్రాఫర్స్ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ నారాయణపూర్ గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ వేడుకలో ఫొటో తీస్తున్న సమయంలో స్టేజిపై నిలుచొని ఉన్న వారు తమ సెల్‌ఫోన్‌లో తీయమని ఆదేశించారన్నారు. అందుకు ఫొటోగ్రాఫర్ నిరాకరించగా సహనం కోల్పోయిన వారు విచక్షణరహితంగా కొట్టారన్నారు. ఫొటోగ్రాఫర్‌పై భౌతిక దాడికి పాల్పడిన వారిని కఠినమైన శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

●చొప్పదండి, జూన్11: ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండిస్తూ చొప్పదండిలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో అసోసి యేషన్ అధ్యక్షుడు అజయ్‌కుమార్, సామల కిషోర్, తెలుకుంట వేణు, సిరిపురం శ్రీనివాస్, తాటిపల్లి శివ, పెద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గంగాధర, జూన్ 11: గంగాధర మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ శ్రీరాం మధుకర్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి పాలక వర్గ సభ్యులు హాజరవుతున్నందున అన్ని శాఖల అధికా రులు తమ నివేదికలతో హాజరుకావాలని కోరారు.

రాష్ట్ర చిహ్నంలో అంబేద్కర్ ఉండేలా చూడాలి

వీణవంక, జూన్ 11: రాష్ట్ర చిహ్నంలో అంబేద్కర్ ఉండేలా చూడాలి తహసీల్దార్ లక్ష్మణ్‌కు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సదానందం, రాజేష్, రాజు, రవి కిరణ్, రాకేష్, గురువయ్య, రాజేంద్ర ప్రసాద్, కిషోర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

నాటికకు స్పందన

హుజూరాబాద్, జూన్ 11: పట్టణానికి చెందిన కాకతీయ కళా సమితి ఆధ్వర్యంలో వరంగల్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన వీలునామ నాటికకు స్పందన లభించిందని కళాకారుడు కుడికాల ప్రభాకర్ మంగళవారం తెలిపారు. నటీనటులు వేసిన పాత్రలు ఆకట్టుకున్నాయని, దీనికి వరంగల్ జిల్లా రంగస్థల ఐక్యవేదిక నిర్వాహకులు అవార్డు అందజేసినట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్, జూన్ 11: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని యువజన కాంగ్రెస్ నాయకుడు టేకుల శ్రావణ్ మంగళవారం పంచాయతీ రాజ్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. మండల పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు పత్రంలో కోరారు.

వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిమ్మాపూర్, జూన్ 11: ఇందిరానగర్‌లోని ప్రియా డెయిరీలో సన్‌షైన్ ఆస్పత్రి నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యు రాలు అపూర్వ, మార్కెటింగ్ మేనేజర్ సంతో షకుమార్, ప్రియా డెయిరీ డీజీఎం శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

శంకరపట్నం, జూన్ 11: కన్నాపూర్, రాజాపూర్, కొత్తగట్టు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బసవయ్య, కొత్తగట్టు దేవస్థానం చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.